సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



ఆరోగ్య భాగ్యం 9లో

మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు.



చవితి సందడి 9లో

వినాయక చవితి సమీపించడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్లలో గణేష్ విగ్రహాలను విక్రయిస్తున్నారు.



గంజాయి నిందితుల అరెస్టు

మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు గంజాయి కేసుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 8లో

న్యూస్‌రీల్

కాలినడకన వెళ్లి పురుడు పోసిన 108 సిబ్బంది

తల్లీబిడ్డ క్షేమం



108 వాహనంలో తల్లీబిడ్డలు

రాజవొమ్మంగి: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి కుటుంబ సభ్యుల నుంచి ఫోన్ రావడంతో రాజవొమ్మంగికి చెందిన 108 సిబ్బంది కొండపై ఉన్న గ్రామానికి కాలినడక వెళ్లి ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొయ్యూరు మండలం పర్వతప్రాంతంలో గల కొనుకూరులో గ్రామంలో పాంగి కుమారి (36) అనే ఆదివాసీ గర్భిణికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సోమవారం ఫోన్ చేశారు. ఆ గ్రామానికి బయలుదేరిన 108 వాహనం మార్గమధ్యంలో ఘాట్ రోడ్డు ఎక్కలేక నిలిచిపోయింది. దీంతో సిబ్బంది అక్కడ నుంచి నాలుగు కిలో మీటర్లు కాలినడకన వెళ్లి, కుమారికి ఆమె ఇంటి వద్దనే ప్రసవం చేశారు. బిడ్డ మెడకు పేగు చుట్టుకోగా అతి ప్రయాసతో ప్రసవం జరిపి తల్లీబిడ్డలను కాపాడగలిగారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కొంతదూరం మోటారు సైకిల్‌పై, ఆ తరువాత 108 వాహనంలో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఈఎంటీ అర్జునబాబు తెలిపారు. పైలెట్ మరణిరాజు, అంగన్‌వాడీ టీచర్లు బేబీరాణి, కాంతమ్మ, ఏఎన్ఎం కుమారి తమకు సహకరించారని ఆయన చెప్పారు.

త్వరితగతిన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



కార్యాలయ నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

హుకుంపేట: అసంపూర్తిగా నిలిచిపోయిన హుకుంపేట తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి కలెక్టర్ నిధులు విడుదల చేయనున్నారని, ఐటీడీఏ నుంచి కూడా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. వచ్చేనెలాఖరు నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగించాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గతంలో అర్బన్ హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారని అధికారులు పీవోకు వివరించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, గిరిజన సంక్షేమశాఖ ఏఈ ధృవకుమార్ పాల్గొన్నారు.

14న ఏయూలో జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈనెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబుతెలిపారు. డెక్కన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ కెమిస్ట్ విభాగంలో 250, జూనియర్ కెమిస్ట్ విభాగంలో 100 ఖాళీ లు ఉన్నాయన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కి 27 ఏళ్లు, జూనియర్ కెమిస్ట్‌కి 30 ఏళ్ల లోపువారు అర్హులు పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కి నెలకు రూ.19,744, జూనియర్ కెమిస్ట్‌కి ఏడాదికి రూ.3.5లక్షలు వేతనంగా అందిస్తామన్నారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ ఆపరేషన్స్ ఉద్యోగానికి టైప్‌రైటింగ్‌లో నిమిషానికి 28 పదాలు టైప్ చేయగలిగి, డిగ్రీవిద్యార్హతగల వారు అర్హులన్నారు. మొత్తం258 ఖాళీలు ఉన్నాయని, వీరికి నెల కు వేతనంగా రూ.15 వేలు అందిస్తారన్నారు. వివరాలకు 9666092491 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలకు 654 మంది హాజరు

ఆరిలోవ(విశాఖ): విశాఖ రేంజ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాల కోసం విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు సోమవారం 654 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు గత నెల 25 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం హాజరైన అభ్యర్థులకు ఇక్కడ పోలీస్ సిబ్బంది వేలిముద్ర వేయించి, సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం వారికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షించారు.

బంద్ విఫలం

- టీడీపీ పిలుపునకు కానరాని స్పందన
- యథావిధిగా కార్యకలాపాలు
- తెరుచుకున్న దుకాణాలు
- పనిచేసిన విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు



పాడేరు పట్టణంలోని సినిమాహాల్ సెంటర్‌లో జన సంచారం

సాక్షి, పాడేరు: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు విఫలమైంది. యథావిధిగా ప్రజా జీవనం కొనసాగింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ టీడీపీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. దీనికి జనసేన,వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. ఈ బంద్‌ను జిల్లాలో ప్రజలెవరూ పట్టించుకోలేదు. యథావిధిగా రోడ్లపైకి వచ్చి.. తమ పనుల్లో నిమగ్నమవగా... ప్రజా రవాణా వ్యవస్థ సైతం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగింది. పాడేరు,అరకులోయ,రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలో కొన్ని చోట్ల టీడీపీ నేతలు కొంతమంది బలవంతంగా దుకాణాలను మూసివేయించారు. పాడేరులో చాలామంది ఉదయాన్నే దుకాణాలు తెరిచారు.చిరువ్యాపారులు రోడ్డుపై కూరగాయలు అమ్ముకుంటున్న సమయంలో కొంతమంది టీడీపీ నేతలు ఆయా వ్యాపారులను హెచ్చరించడంతో పాటు బలవంతంగా మూయించే చర్యలకు పాల్పడ్డారు. రంపచోడవరం,అరకులోయ నియోజకవర్గ కేంద్రాలలోను అదే పరిస్థితి. ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజన హోటళ్లు కూడా తెరచుకున్నాయి. పోలీసుశాఖ 144వ సెక్షన్ అమలుజేయడంతో ఏజెన్సీలోని అన్నవరం,పెదబయలు వారపుసంతలు జరగలేదు. వై.రామవరంలో యథావిధిగా సంత జరిగింది. పాడేరు,విశాఖపట్నం, అనకాపల్లి,ఎస్.కోట,రాజమండ్రి, నర్సీపట్నం,ఏలేశ్వరం,కాకినాడ,గోకవరం డిపోల నుంచి ఆర్టీసీబస్సు సర్వీసులు యథావిధిగానే జిల్లాలో నడిచాయి.ప్రైవేట్ వాహనాలు,జీపులు,ఆటోలు సర్వీస్ చేశాయి.కొన్ని ప్రైవేట్ పాఠశాలలు మినహా,అన్ని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి.పాడేరులోని కలెక్టరేట్‌కు పలు వర్గాల ప్రజలు వచ్చి వివిధ పనులపై కలెక్టర్‌తో పాటు, వివిధ శాఖల అధికారులను కలిశారు.టీడీపీ నేతల బలవంతంతో మూయించిన దుకాణాలను మధ్యాహ్నం నుంచి వ్యాపారులు తెరిచారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు, సిబ్బంది మండల కేంద్రాలు,ప్రధాన జంక్షన్‌లలో బందోబస్తు నిర్వహించారు.పాడేరు ఏఎస్పీ ధీరజ్ జిల్లా కేంద్రం పాడేరులోని పరిస్థితిని సమీక్షించారు.



వై.రామవరంలో జరిగిన సంతకు వచ్చిన జనం



పాడేరులో దుకాణాలను బలవంతంగా మూసివేయించేందుకు బైక్‌లపై తిరుగుతున్న టీడీపీ నేతలు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నడుస్తున్న బస్సులు

అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్



అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్

సాక్షి, పాడేరు: అటవీ సంరక్షణ విధుల్లో అమర వీరులు చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకమని, వారిని ఆదర్శంగా తీసుకుని విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించాలని పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్ అన్నారు. జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినాన్ని సోమవారం పాడేరు అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన సి.రామయ్య, కేశవులు, సోమయ్య, రామచంద్రారెడ్డి, అబ్దుల్ గఫూర్, పెంచలయ్య, భాస్కరరెడ్డి, ఆశీర్వాదం, శ్రీనివాసులు, శ్రీధర్ తదితర 23 మంది అటవీశాఖ అధికారులు, ఉద్యోగుల చిత్రపటాలకు డీఎఫ్‌వో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ పరిధిలోని అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు అమరులకు నివాళులర్పించి, శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ విధుల్లో అమరులైన అటవీశాఖ అధికారులు, ఉద్యోగుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తున్నాయన్నారు. అటవీశాఖలో ఉద్యోగ నిర్వహణ సాహసంతో కూడుకున్నదన్నారు. గిరిజన ప్రాంతాలలో అటవీ సంరక్షణకు కృషి చేస్తున్న అధికారులు, ఉద్యోగులు అభినందనీయులని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రవణికి అన్ని విధాలుగా ప్రోత్సాహం

కలెక్టర్ సుమిత్ కుమార్



సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవణి

సాక్షి,పాడేరు: అంధుల క్రికెట్ ప్రపంచకప్‌లో భారత విజయంలో కీలకపాత్ర పోషించిన గిరిజన యువతి రవణిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చారు. హుకుంపేట మండలం మెరకచింత పంచాయతీ రంగసింగిపాడు గ్రామానికి చెందిన రవణి సోమవారం రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,ఇతర నేతలతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆమె కలిసింది. తనకు సహకరించాలని వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ వరకు చదువుకోవాలని, అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. రవణి కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున సహకారం అందించేందుకు నోడల్ కలెక్టర్‌కు లేఖ రాస్తామన్నారు.కడప క్రికెట్ అసోసియేషన్ చైర్మన్‌తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి రవణి మరింత సహకారం అందించాలని కోరారు. రవణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించే విధంగా ప్రతి పాఠశాలలో మైదానాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.రవణి తల్లిదండ్రులు గోపాలకృష్ణ,చిట్టమ్మ,గిరిజన సంఘం నేత కృష్ణారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

- కల్వర్టుపై నుంచి ప్రవహించిన వరద నీరు
- లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు మధ్య నిలిచిన రాకపోకలు



లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో కల్వర్టుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

ముంచంగిపుట్టు: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో సుత్తిగూడ గ్రామం వద్ద కల్వర్టు పై నుంచి భారీగా వరదనీరు ప్రవహించింది. దీంతో లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు పంచాయతీ కేంద్రానికి రాకపోకలు సుమారు 3గంటల పాటు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో ఎప్పుడు లేని విధంగా సుత్తిగూడ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించిందని స్థానికులు తెలిపారు. వరదనీటి వల్ల కల్వర్టుకు పక్కనున్న పంట పొలాలు కోతకు గురయ్యాయి. లక్ష్మీపురం,బుంగాపుట్టు పంచాయతీల్లో విధులకు వెళ్లే ఉద్యోగులు,ఉపాధ్యాయులు,ఆరోగ్య సిబ్బంది 3గంటల పాటు వేచి చూసిన అనంతరం భయం భయంగా కల్వర్టుపై నుంచి వచ్చే వరద నీరును దాటుకుని వెళ్లారు. ఇదే మార్గంలో బిరిగూడ వాగు సైతం ఉధృతంగా ప్రవహించడంతో జబడ,మాలిపుట్టు గ్రామాల గిరిజనులు అతి కష్టం మీద వాగు దాటుకుని రాకపోకలు సాగించారు.

అరకులోయ రూరల్: మండలంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మండల వాసులు, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.24.63 లక్షలు

డాబాగార్డెన్స్(విశాఖ): కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం లెక్కింపు సోమవారం చేపట్టారు. గత నెల 9నుంచి ఈనెల11వ తేదీ వరకు హుండీల ద్వారా రూ.24,63,152 నగదు, 63 గ్రాముల 450 మిల్లీ గ్రాముల బంగారం, 850 గ్రాముల 100 మిల్లీ గ్రాముల వెండి వచ్చింది. యూఎస్ఏకి చెందిన 92 డాలర్లు, సింగపూర్‌కి చెందిన 12 డాలర్లు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 230 పౌండ్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్‌కు చెందిన 10 రియల్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన 10 దీరమ్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో శిరీష,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

15లోగా ఓటరు దరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



రెడ్‌క్రాస్ సొసైటీ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్,జేసీ శివశ్రీనివాస్

సాక్షి, పాడేరు: ఓటరు దరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియను ఈనెల 15వ తేదీలోగా పూర్తిచేయాలని, ఫారం 6,7,8 ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. తన కార్యాలయం నుంచి సోమవారం జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులు. 100 ఏళ్ల వయసు పైబడిన ఓటర్లు, ఒకే ఇంట్లో 10 మంది ఓటర్లు ఉంటే పరిశీలన, పీఎం కిసాన్, జనన ధ్రువీకరణ పత్రాల జారీపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, ఇతర కార్యక్రమాలన్నింటిపైన ప్రత్యేక చొరవ చూపి, సకాలంలో పూర్తి చేయాలన్నారు. 389 గ్రామాల్లో అసైన్డ్ భూముల రీసర్వే పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, పుట్టిన ప్రతిబిడ్డకు జనన నమోదు పత్రాలను మంజూరు చేసి ఆధార్ కార్డులు కూడా జారీ చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి అర్హులకు పీఎం కిసాన్ పథకాన్ని అమలుజేయాలన్నారు.ఈ సమావేశంలో జేసీ శివశ్రీనివాస్,ఐటీడీఏ పీవో అభిషేక్,డీఆర్వో అంబేడ్కర్,జిల్లా వ్యవసాయాధికారి నందు, సర్వేశాఖ ఏడీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరు నాటికి వైద్యుల నివాస భవనాలు పూర్తి

పాడేరులోని మలేరియా శాఖ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న వైద్యుల నివాస భవన నిర్మాణాలన్నింటినీ అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ భవన నిర్మాణాలను సోమవారం ఆయన ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణాలకు మరో రూ.15 లక్షల మంజూరు చేస్తున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, డీఈఈ అనుదీప్ పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

అత్యవసర సమయంలో కేజీహెచ్ సెల్ ద్వారా రెడ్‌క్రాస్ అంబులెన్స్ సేవలను వినియోగించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రెడ్ క్రాస్ సొసైటీకి గవర్నర్ మంజూరు చేసిన రూ.25 లక్షలతో కొనుగోలు చేసిన కొత్త అంబులెన్స్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శివశ్రీనివాస్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రైబల్ సెల్‌లోని గిరిజనులకు అత్యవసర వైద్యసేవలు,పార్థివ దేహాలు తరలించడానికి అంబులెన్స్ వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు లోహితాసుడు, సూర్యారావు,సంజీవ్ పాల్గొన్నారు.

గిరిజనులకు సేవలందించడమే లక్ష్యం

జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యోగులు గిరిజనులకు సేవలందించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.జిల్లాలోని ఎంపీడీవోలు,ఎంఈవోలు,ఉపాధి హామీ పథకం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అన్ని అంశాలపైన కలెక్టర్ సమీక్షించారు.అర్హులందరికీ జాబ్‌కార్డులు పంపిణీ చేయాలని, ఆధార్ కేంద్రాల ద్వారా కొత్త ఆధార్ కార్డులు జారీ చేయాలని,పెండింగ్‌లో ఉన్న జనన ధ్రువీకరణ పత్రాల పంపిణీని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల హాజరు వివరాలను సమర్పించని చింతూరు,దేవీపట్నం, జీకే వీధి,పెదబయలు,మారేడుమిల్లి, ఎటపాక,వై.రామవరం ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో శాంతలక్ష్మి, డీపీవో కొండలరావు,డీఎల్‌పీవో కుమార్,ఉపాధి పథకం ఏపీడీ జవ్వాది గిరిబాబు పాల్గొన్నారు.

గిరి సీమల్లో కొబ్బరి సిరులు

- మన్యంలో కొబ్బరి సాగుకు ప్రోత్సాహం
- 375 మంది రైతులకు మొక్కల పంపిణీ
- సాగు విస్తీర్ణం పెంచేందుకు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు చర్యలు



రైతులకు కొబ్బరి మొక్కలు అందజేస్తున్న బోర్డు డైరెక్టర్



కేవీకే మొక్కల ప్రదర్శన క్షేత్రం

రంపచోడవరం: కొబ్బరి సాగు ఇకనుంచి గిరి సీమల్లోనూ జోరుగా సాగనుంది. గిరి సీమల్లో సిరులు కురిపించడం ద్వారా గిరిపుత్రుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనుంది. రాష్ట్రంలో కొబ్బరి దిగుబడి ఎక్కువగా ఉన్నా..విస్తీర్ణం తక్కువగా ఉండడంతో కోకోనట్ బోర్డు కొబ్బరి అభివృద్ధికి చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అవకాశం ఉన్న చోట కొబ్బరి పంట వేసేందుకు ప్రోత్సాహిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో కూడా సాగుకు శ్రీకారం చుట్టింది. గిరిజన రైతుల్లో కొబ్బరి పంటపై చైతన్యం నింపేందుకు ఇటీవల ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి కొబ్బరి రైతులు హాజరయ్యారు. ఏజెన్సీలో కొబ్బరి సాగు అనుకూలతలపై ఇప్పటికే అనేక పరిశీలనలు చేసింది. మన్యం కొబ్బరి సాగు అనుకూలంగా ఉండడంగా కొబ్బరి సాగును ప్రోత్సాహించే దిశగా అడుగులు వేస్తోంది.

తొలి విడతగా 375 మంది రైతులకు

జిల్లాలో తొలివిడతగా 375 మంది గిరిజన రైతులకు రెండేసి కొబ్బరి మొక్కలను కొబ్బరి బోర్డు సహకారంతో పంపిణీ చేశారు. మొక్కల పంపిణీ ద్వారా రైతుల్లో కొబ్బరి సాగుపై ఆసక్తి పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం కొబ్బరి మొక్కలు పెంచేందుకు అనుకూలతలపై మరింత సమాచారాన్ని కొబ్బరి బోర్డు సేకరిస్తోంది. అనంతరం కొబ్బరి సాగుద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు బోర్డు అధికారులు వివరిస్తారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్, ఐటీడీఏ సహకారంతో గ్రామస్థాయిలో కొబ్బరి సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కొబ్బరి సాగును విస్తరించడంలో భాగంగా రైతులకు రూ.5కే కొబ్బరి మొక్కలను అందజేస్తున్నారు. రైతులు ప్రభుత్వం ఫాం, ప్రైవేట్ నర్సరీల్లో పాస్‌బుక్ ద్వారా ఈ కొబ్బరి మొక్కలు కొనుగోలు చేసుకోవాలి. మొక్కలు నాటిన తరువాత రైతు ఖాతాలో రూ.40 జమ చేస్తారు. కేవలం రైతు ముందుగా మొక్కలు కొనుగోలు చేసుకుంటే నాటి తరవాత 50శాతం నగదు ఖాతాలో జమ అవుతుంది. ఇలా రైతు పది మొక్కల నుంచి పది ఎకరాల వరకు కొబ్బరి మొక్కలు నాటుకోవచ్చు.

ఏజెన్సీ ప్రాంతం కొబ్బరి సాగుకు అనుకూలం

ఏజెన్సీ ప్రాంతంలో కొబ్బరి సాగు అనుకూల వాతావరణం ఉంది. ఏజెన్సీలో పలు ఇళ్ల వద్ద కొబ్బరి మొక్కలు కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో వాతావరణంలో తేమ ఉండడంతో కొబ్బరి సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రయోగాత్మకంగా కొబ్బరి మొక్కలు నాటాం. పెరుగుదల బాగుంది.

– క్రాంతికుమార్, హార్టికల్చర్ శాస్త్రవేత్తం, కేవీకే పందిరిమామిడి

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం
వంజంగి హిల్స్ రోడ్డు, పాడేరు
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు :
94915 53782, 70757 09205

క్లుప్తంగా

8 మంది గంజాయి నిందితుల అరెస్టు

మోతుగూడెం: మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రెండు గంజాయి కేసులు నమోదైయ్యాయి. రెండు మోటార్ బైక్‌లపై పది కేజీల గంజాయి తరలిస్తూ నిందితులు పట్టుబడ్డారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో నలుగురు మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వారు కాగా మిగిలిన ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారు. బెంగుళూరుకి చెందిన అన్సారీర్ అనే వ్యక్తి ఒడిశాలో గంటవాడ, ఆర్ఎస్‌సీ–15కి చెందిన వంతల గురు వద్ద 22 కేజీలు గంజాయి కొనుగోలు చేసి బైక్‌పై తరలిస్తుండగా మార్గమధ్యలో మోతుగూడెంలో పోలీసులు పట్టుకున్నారు. రెండుకేసులో మొత్తం 8 మంది ముద్దాలను అరెస్టు చేశారు. మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణ చట్ట రీత్యా నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సార్వత్రిక విద్య పరీక్ష ఫీజు గడువు వచ్చే నెల 15

అనకాపల్లిటౌన్: వచ్చే ఏడాది(2024)లో జరిగే సార్వత్రిక విద్యాపీఠం టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకాగోరు విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ ఏడాది అక్టోబర్ 15 లోపు చెల్లించాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

అమరులకు ఘన నివాళి



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

- ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం
- అవగాహన ర్యాలీలు



అనంతగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది



రాజవొమ్మంగిలో అటవీశాఖ సిబ్బంది ర్యాలీ

అనంతగిరి: విధి నిర్వహణలో అమరులై అటవీ సంరక్షణ కోసం ప్రాణాలనుపణంగా పెట్టిన వారిని గుర్తు చేసుకోవడం గొప్పవిషయామని, అనంతగిరి ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ వద్ద అటవీ అమరవీరులు దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి, అమరులైన వారికి నివాళులర్పించారు. సిబ్బంది సీతారం, సత్యం పాల్గొన్నారు.

చింతపల్లి: జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అటవీ శాఖ డివిజన్ కార్యలయం నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. డీఎఫ్‌వో సూర్యనారాయణ, సబ్ డీఎఫ్‌వో రాజు, ఎఫ్ఆర్వో చిట్టి తల్లి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర చెప్పారు. రాజవొమ్మంగి రేంజ్ ఆఫీస్‌లో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పందిళ్ళపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఎస్‌ఓలు రాము, బాలాజీ, బీఎఫ్‌ఓలు సూర్యప్రసాద్, ఆనంద్, రామకృష్ణ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి దాడి చేసిన పోలీస్‌స్టేషన్‌ను పరిరక్షించాలి

అల్లూరి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు పడాల



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ రాంబాబు, వీరభద్రరావు తదితరులు

అడ్డతీగల: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు దాడి చేసిన అడ్డతీగలలోని పోలీస్‌స్టేషన్‌ను పరిరక్షించాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కోరారు. యువజన సంఘం సభ్యులతో కలిసి అడ్డతీగలలోని వాస్తవ పోలీస్ స్టేషన్‌తో పాటు పైడిపుట్టలో అల్లూరి చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న రావిచెట్టు(రచ్చబండ), అక్కడి అల్లూరి విగ్రహాన్ని సోమవారం సందర్శించారు. సీఐ వై.రాంబాబుతో కలిసి అడ్డతీగలలోని అల్లూరి దాడి చేసినపోలీస్‌స్టేషన్ ఎదుట అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనాడు అల్లూరి దాడి చేసిన వాస్తవ పోలీస్‌స్టేషన్ స్వాతంత్ర్య పోరాటానికి అల్లూరి పాత్రకు సాక్షీభూతంగా నిలిచిందని పడాల వీరభద్రరావు అన్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంటోందని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు తగిన విధంగా పరిరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. స్టేషన్ ముందు ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటించి ఉద్యానవనంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం జాతీయ కార్యదర్శులు రామన శ్రీను,దంగేటి సత్తిబాబు,దొరబాబు యువసేన అధ్యక్షుడు తేతలి పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



ఉరి వేసుకున్న చంద్రిక

హుకుంపేట: ప్రేమించిన వ్యక్తి మోసాన్ని భరించలేక, అతనికి రెండో భార్యగా వెళ్లడం ఇష్టంలేక తీవ్ర మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్యచేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్ కథనం ప్రకారం వివరాలు.. తడిగి పంచాయతీ బొడ్డాపుగ్రామానికి చెందిన పాంగి చిట్టిబాబు,శోభకోట పంచాయతీ ఈడలగొంది గ్రామానికి చెందిన మర్రి చంద్రిక(20) రెండేళ్లగా ప్రేమించుకుంటున్నారు. నెల రోజుల క్రితం చిట్టిబాబుకు మరో యువతితో వివాహం జరిగింది. చంద్రిక అనారోగ్యంతో ఉండడంతో ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించగా గర్భవతి అని తేలింది. చంద్రిక కుటుంబ సభ్యులకు ప్రేమ వ్యవహారం తెలిసింది. కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు సుబ్బారావు, చిన్నలమ్మల ఫిర్యాదు మేరకు ఆదివారం గ్రామాల పెద్దలు విచారించి, చంద్రికను చిట్టిబాబు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించారు. దీనికి సమ్మతించిన చిట్టిబాబు అదేరోజు సాయంత్రం చంద్రికను బొడ్డాపుట్టుకు తీసుకువెళ్లాడు. గ్రామంలో గల బంధువుల ఇంటికి చంద్రిక అదే రోజు వెళ్లింది. రెండవ భార్యగా వెళ్లడం ఇష్టంలేని ఆమె తీవ్రమనస్తాపంతో రాత్రి ఒంటిగంట సమయంలో బంధువుల ఇంటిపక్కన గల చెట్టుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని సెల్‌ఫోన్‌లో తన చెల్లికి మెసేజ్ పెట్టింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చంద్రిక ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే పాల్గుణ



ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడుతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు

సాక్షి,పాడేరు: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును తారువాలో సోమవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కలిశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా శివారు గ్రామాలకు రోడ్లు, తాగునీటి సదుపాయం పనులకు నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడుని కోరినట్టు ఎమ్మెల్యే పాల్గుణ చెప్పారు. అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగి ఉమామహేశ్వరరావు, పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు, పెదబయలు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్ కుమార్, హుకుంపేట పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ తదితరులున్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ వారిచే ఈ నెల 9, 10 తేదీలలో కర్నూల్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియం నందు జరిగిన 48వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యార్థులు అండర్ 10,12 విభాగంలో బి.దేవాన్ష్ నాయుడు (7 వ తరగతి) ప్రథమ స్థానాన్ని, జి.సోమసూర్యచరణ్ (6 వ తరగతి) ద్వితీయ స్థానాన్ని, అండర్ 8–10 విభాగంలో సిహెచ్.జయదీప్ (4 వ తరగతి) ద్వితీయ స్థానాన్ని, అండర్ 12–14 విభాగంలో జి.హర్షవర్ధిని (8వ తరగతి) తృతీయ స్థానాన్ని సాధించి నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, అకడమిక్ ఇన్‌ఛార్జిలు, యోగా గురువులు అభినందించారు.

జిల్లాలో విద్యారంగం బలోపేతానికి కృషి

- ఉపాధ్యాయులు,ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి
- నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు : కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి,పాడేరు: జిల్లాలో విద్యారంగం బలోపేతానికి అందరూ.. ముఖ్యంగా ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 జనగణన ప్రకారం ఏజెన్సీలో అక్షరాస్యత 53శాతం ఉండగా మహిళల్లో కేవలం 39శాతం అక్షరాస్యత మాత్రమే ఉందన్నారు. ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సమావేశం నిర్వహించి, విద్యారంగంపై సమీక్షించారన్నారు. గిరిజన విద్య బలోపేతం,అక్షరాస్యత పెంచే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. జిల్లాలో 10వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారంతా సక్రమంగా పాఠశాలలకు వెళ్లాలన్నారు.పాఠశాలలను సమయానికి తెరచి,నాణ్యమైన విద్యాబోధన చేపట్టాలన్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్‌లు లేకుండా చూడాలని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు సంఘాల పేరుతో విధుల నిర్లక్ష్యం చేయడం,అధికారులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులంతా బాధ్యతయుతంగా పనిచేయాలని,పాఠశాలల నిర్వహణలోను క్రమశిక్షణ పాటించాలన్నారు. ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేసిన,అవినీతికి పాల్పడిన,మద్యం సేవించి విధులకు హాజరైనా ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.గిరిశిఖర గ్రామాల్లో అదనంగా పాఠశాలల ఏర్పాటు.విద్యా వలంటీర్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలతో గిరిజన విద్యను బలోపేతం చేస్తామన్నారు.అలాగే పంచాయతీరాజ్‌తో పాటు అన్ని ఇంజినీరింగ్ విభాగాలు,విద్యా,వైద్యం,రెవెన్యూ తదితర అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు,ఉద్యోగులు,సచివాలయాల సిబ్బంది అంతా విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. ఫేషియల్ రికగ్నైజ్ హాజరు నుంచి ఎవరికీ మినహాయింపు లేదన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలలను సందర్శించి,విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు,వైద్యసిబ్బంది సక్రమంగా పనిచేయక పోయినా ప్రజలు చైతన్యవంతులై తమకు ఫిర్యాదు చేయాలని, స్పందనలో కూడా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. ఎవరిపైనా అన్యాయంగా చర్యలు తీసుకోబోమని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై మాత్రం తగిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

విలువలతో కూడినదే సాహిత్యం

తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందన సభ



ఆచార్య ఇనాక్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు, ఆచార్యులు

ఏయూక్యాంపస్: మౌలిక విలువతో కూడినదే సాహిత్యమని ఎస్‌వీ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఏయూ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆయనను ఏయూ తెలుగు విభాగంలో ఘనంగా సత్కరించారు. తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథిలుగా ఆచార్య జి.యోహాన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను తెలుగు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు శాఖలో అద్భుత పాండిత్యంగల మేధావుల సాంగత్యంలో తాను రచనలో రాటుదేలానన్నారు. కన్నీళ్లమయమైన సమాజపోకడను నిశతంగా పరిశీలించి ఎత్తుపల్లాలను జేరీజు వేసి సాహిత్యం ద్వారా సమాజానికి అందించానన్నారు. తాను ఇప్పటి వరకు 104 గ్రంథాలు రచించానని వాటిలో మౌలిక అంశాలు, సార్వకాలీక సార్వజనీనమై నిలిచాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు లోక జ్ఞానం కోసం వివిధ ప్రాంతాల సాంస్కృతిక జీవనాన్ని అధ్యయనం చేస్తే వి/జ్ఞానం విస్తృతమవుతుందన్నారు. తనకు ఎన్ని అవార్డులు వచ్చినా మాతృసంస్థ ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుంచి గౌరవ డి.లిట్ డాక్టరేట్ అందుకోవడం మధురానుభూతి కలిగించిందన్నారు. కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర అయ్యగారి సీతారత్నం, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), ఆచార్య గంగిశెట్టి పద్దయ్య, ఆచార్య ఉయ్యూరి భాస్కరరావు, డాక్టర్ ఎస్.పుల్లారావు, ఎస్.అంబేద్కర్ రాజు, డాక్టర్ ఎల్.గిరీష్ కుమార్, పట్నాన ధర్మారావు, మొండి స్వామి, రామారావు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన జైలు ఉత్పత్తులు



తమిళనాడు జైల్‌లో ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులు



వస్తువులను పరిశీలిస్తున్న బీపీఆర్‌అండ్‌డీ డీజీ శ్రీవాత్సవ్

ఆరిలోవ: జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు సోమవారం విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ (బీపీఆర్‌అండ్‌డీ), ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రుషికొండ ప్రాంతం సాయిప్రియ రిసార్ట్స్‌లో ఈ సదస్సు ప్రారంభమైంది. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ సదస్సు మంగళవారం ముగియనుంది. సదస్సులో కేంద్ర హోం శాఖసహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ముఖ్యఅతిథిగా, రాష్ట్ర హోం శాఖామంత్రి తానేటి వనిత అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు బీపీఆర్ అండ్‌డీ డీజీ బాలాజీ శ్రీవాత్సవ్, ఏపీ జైళ్ల శాఖ డీజీ అనీష్‌కుమార్ గుప్తా, అన్ని రాష్ట్రాలజైళ్ల శాఖ డీజీపీలు, ఐజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ఆవరణలో దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న జైళ్లలో ఖైదీలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శించారు. దుస్తులు, చెక్కతో తయారుచేసిన వివిధ బొమ్మలు, ఫినాయిల్, అల్లిక బుట్టలు తదితర వస్తువులు అతిథులను ఆకట్టుకొన్నాయి. ఆయా వస్తువులు ధరలు వాటి వద్ద రాసి పెట్టారు. వీటిని తిలకించిన ఆయా రాష్ట్రాల జైళ్ల అధికారులు వారివారి జైళ్లలో కూడా ఖైదీలతో తయారు చేయించాలనే ఆలోచనకు వచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ

Online Proposal No.: FP/AP/ROAD/416334/2023 తేది : 07/09/2023

బహిరంగ ప్రకటన

(పూర్వపు తూర్పుగోదావరి జిల్లా) ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని కాకవాడ నుండి ఆకూరు వరకు రోడ్డు నిర్మాణం కోసం రంపచోడవరం డివిజన్‌లోని Compt No. 755, కాకవాడ PF, Compt No. 416 వేములకొండ RF మరియు Compt No. 385 లో ఆకూరు RF లోకి వచ్చే 4.73 హెక్టార్ల అటవీ భూమిని రహదారులు మరియు భవనముల శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, రాజమహేంద్రవరం వారి పేరున భూమి మళ్లింపుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీ శాఖ మరియు భారత ప్రభుత్వం పర్యావరణ అడవుల మంత్రిత్వశాఖ వారు సూత్రపాయ స్టేజ్-1 ఆమోదం ఆన్‌లైన్ ప్రపోజల్ నెం. FP/AP/ROAD/416334/2023 తేది 16-8-2023 ప్రకారం ఇవ్వబడింది.

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆన్‌లైన్ ప్రపోజల్ నం. FP/AP/ROAD/416334/2023 తేది 30-1-2023 క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మరియు R.O చెన్నై మరియు వారి SRO విజయవాడ వారి ద్వారా ప్రతిపాదనతో పరిశీలించిన మీదట దిగువ తెలిపిన నిబంధనలకు లోబడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, R&B, రాజమహేంద్రవరం వారి పేరున కి.మీ 0/0 నుండి 13/0 వరకు కాకవాడ నుండి ఆకూరు రోడ్డువరకు రోడ్డు నిర్మాణం కోసం రంపచోడవరం డివిజన్‌లోని Compt No. 755, కాకవాడ PF, Compt No. 416 వేములకొండ RF మరియు Compt No. 385 ఆఫ్ ఆకూరు RF లోని 4.73 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపుకోసం అటవీ (సంరక్షణ) చట్టం 1980లోని సెక్షన్ 2 క్రింద కేంద్రప్రభుత్వ సూత్రప్రాయ ఆమోదంను నేను తెలియజేస్తున్నాను.

1. సాధారణ నిబంధనలు :

క్ర.సం	నిబంధనలు
1.1	మళ్లించిన అటవీ భూమి యొక్క న్యాయ స్థితి యధాతథంగా ఉంది.
1.2	యూజర్ ఏజెన్సీ యొక్క వ్యయంపైన CA స్కీమ్ ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా, లింగవరం గ్రామం, సర్వే నెం. 1 లోని 5.13ha విస్తీర్ణం గల అటవీయేతర భూమిలో రాష్ట్ర అటవీశాఖ నష్టపరిహార అటవీ పెంపకం, సంరక్షణ, నిర్వహణ చేపట్టాలి. FC రూల్స్ 2022 క్రింద ఏర్పాటు చేసిన టైమ్‌లైన్ ప్రకారం CA స్కీమ్ అమలు చేయవలెను.
1.3	ప్రతిపాదిత అటవీ భూమి యొక్క డీమార్కేషన్‌ను తగు విధంగా నంబర్లు వేసిన 4 అడుగుల గల సిమెంట్ కాంక్రీట్ పిల్లర్లను 20 మీటర్ల అంతరాలలో యూజర్ ఏజెన్సీ వ్యయంతో స్థాపించబడాలి.
1.4	కేంద్రప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం పొందకుండా గుర్తించిన CA ఏరియా మరియు CA స్కీమ్ మార్పు చేయరాదు.
1.5	అల్లూరి సీతారామరాజు జిల్లా, లింగవరం గ్రామం, సర్వే నెం. 1 లోని 5.13ha విస్తీర్ణంగల అటవీయేతర ప్రాంతం పైన CA కోసం ప్రతిపాదించిన మొత్తం అటవీయేతర భూమి అటవీ శాఖ పేరున బదిలీ చేసి నిర్వహించవలెను మరియు స్టేజ్ II ఆమోదమునకు ముందు RF/PF గా ప్రకటించాలి. భారతీయ అటవీచట్టం 1927లోని సెక్షన్ 4 లేదా సెక్షన్ 29 క్రింద లేదా రాష్ట్ర అటవీ చట్టంలోని సంబంధిత సెక్షన్ క్రింద అటవీయేతర భూమిని ప్రకటిస్తూ ఒరిజినల్ నోటిఫికేషన్ యొక్క కాపీని కంప్లియెన్స్ రిపోర్ట్‌తో పాటు రాష్ట్రప్రభుత్వం దాఖలు చేయాలి.
1.6	రిట్ పిటీషన్ (సివిల్) నెం. 202/1995లోని సంబంధిత IA's తో I.A.No. 826 in 566 లోని గౌరవనీయ సుప్రీమ్‌కోర్టు ఉత్తర్వులు తేది. 28-3-2008 మరియు 9-5-2008 ప్రకారం మరియు మినిస్ట్రీ గైడ్‌లైన్ నెం. 5-3/2013-FC (Vol-I) తేది 6-1-2022 మరియు లెటర్ తేది. 19-1-2022 మరియు 22-3-2022 ప్రకారం జారీచేసిన స్పష్టీకరణ మరియు మంత్రిత్వ శాఖ గైడ్‌లైన్స్ No FC-11/117/2019-FC తేది. 15-3-2023 ప్రకారం యూజర్ ఏజెన్సీ నుండి మళ్లించిన అటవీ భూమి అంటే 4.73ha యొక్క నికర ప్రస్తుత విలువను రాష్ట్ర ప్రభుత్వం చార్జ్ చేయవలెను.
1.7	భవిష్యత్‌లో గౌరవ భారత సుప్రీమ్‌కోర్టుచే అది సవరించబడిన తరువాత బకాయి ఏర్పడితే మళ్లించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువ (NPV) అదనపు మొత్తం రాష్ట్ర ప్రభుత్వంచే యూజర్ ఏజెన్సీ నుండి చార్జ్ చేయవలెను. యూజర్ ఏజెన్సీ దీనికి సంబంధించి అండర్‌టేకింగ్ దాఖలు చేయవలెను.
1.8	ప్రాజెక్ట్ క్రింద యూజర్ ఏజెన్సీ నుండి అందిన అన్ని నిధులు ఇ-పోర్టల్ (https://parivesh.ni.in/) ద్వారా CAMPA ఫండ్‌కు బదిలీ చేయవలెను / డిపాజిట్ చేయవలెను.
1.9	చెట్లు పడగొట్టడం అనేది అవసరమైనప్పుడు సంబంధిత DFO యొక్క ఖచ్చితమైన పర్యవేక్షణ క్రింద నిర్వహించవలెను.
1.10	సంబంధిత DFO ను సంప్రదించుట ద్వారా యూజర్ ఏజెన్సీ ప్రాజెక్ట్ వ్యయంపైన అవసరమైనప్పుడు రిటైనింగ్ వాల్స్ మరియు చెక్ వాల్స్ నిర్మించవలెను.
1.11	సహజమైన వాగులు / నదులు / కాలువలపైన కల్వర్టులు / బ్రిడ్జిలు ఏవైన నిర్మించవలసి వస్తే అవి సహజ నీటి ప్రవాహానికి నష్టం కలిగించకుండా, నీటి నిల్వ పెరుగుటకు మరియు వన్యప్రాణుల కదలికలకు కూడా నష్టం కలగకుండా ఉండే విధంగా నిర్వహించవలెను.
1.12	ఇంజనీరింగ్ సపోర్ట్‌కు అవసరమై రోడ్‌సైడ్ కటింగ్స్ మరియు ఫిల్లింగ్స్‌ను మట్టిని స్థిరంగా ఉంచే విధంగా సంబంధిత DFO సూచనల ప్రకారం సమకూర్చాలి.
1.13	త్రవ్వగా వచ్చిన మెటీరియల్ / ఓవర్ బర్డన్‌ను అటవీ ప్రాంతం వెలుపల పడవేయవలెను. అటవీప్రాంతంలో ఎటువంటి మెటీరియల్ నిల్వ ఉంచకూడదు.
1.14	కేంద్రప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం పొందకుండా ప్రతిపాదనయొక్క లేఅవుట్ ప్లాన్ మార్చకూడదు.
1.15	చెట్లు పడగొట్టకుండా / నష్టం కలిగించకుండా సైట్‌లో పనిచేసే కార్మికులకు యూజర్ ఏజెన్సీ వంటచెరుకు ప్రధానంగా ప్రత్యమ్నాయ ఇంధనంను ఏర్పాటుచేయాలి మరియు లేబర్ క్యాంప్ ఏదీ అటవీప్రాంతంలో ఏర్పాటు చేయకూడదు.
1.16	సాధ్యమైనంతవరకు అటవీప్రాంతం వెలుపల లేబర్ క్యాంపులు ఏర్పాటు చేయుటద్వారా ఆటంకాలను తక్కువచేయాలి మరియు పని నిర్వహణలో నిమగ్నమై ఉన్న మరియు పనిచేస్తున్న కార్మికులు మరియు సిబ్బంది సమీపంలో ఉన్న అటవీ వృక్ష సంపద & జంతుజాలంను నష్టం చేయకూడదు. అందుకు గాను హామీ నిస్తూ యూజర్ ఏజెన్సీ బాధ్యత తీసుకోవలెను.
1.17	ప్రాజెక్ట్ కోసం వినియోగించిన మొత్తం అటవీ విస్తీర్ణం 4.73 హెక్టార్లకు మించరాదు (BT పోర్షన్ 3.75 మీటర్లకు పరిమితం చేయబడింది) మరియు మళ్లించిన అటవీ ఏరియాని మళ్లింపు ప్రతిపాదనలో చూపిన దానికి కాకుండా ఏ అవసరంకి ఉపయోగించరాదు. దీనికి సంబంధించి యూజర్ ఏజెన్సీ ఒక అండర్‌టేకింగ్ దాఖలు చేయవలెను.
1.18	మళ్లింపు కోసం ప్రతిపాదించిన అటవీ భూమి ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం తీసుకోకుండా ఏ ఇతర ఏజెన్సీకి, డిపార్ట్‌మెంట్‌కి లేదా వ్యక్తికి బదిలీ లేదా సబ్‌లెట్ చేయరాదు.
1.19	ప్రాజెక్ట్‌కు వర్తించే విధంగా అమలులో ఉన్న సమయం కోసం అన్ని చట్టాలు, నియమాలు, రెగ్యులేషన్స్ మరియు మార్గదర్శకాలలోని నిబంధనలను పాటించుచూ యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వం రూఢి చేసుకోవలెను.
1.20	పైన తెలిపిన నిబంధనలలో వేటినైనా పాటించుటలో విఫలమైన సందర్భంలో యూజర్ ఏజెన్సీ FCA, 1980 క్రింద జారీ చేసిన రూల్స్ / మార్గదర్శకాల ప్రకారం అపరాధ చర్యకోసం బాధ్యత వహించవలసి ఉంటుంది.
1.21	కేంద్ర ప్రభుత్వం లేదా రీజినల్ ఆఫీస్ యొక్క DDG (సెంట్రల్), చెన్నై వారు సదరు ఏరియాలో అడవులు పెంపకం వృక్షాలు మరియు జంతువుల సంరక్షణ మరియు నిర్వహణ ప్రయోజనంలో కాలానుగుణంగా విధించే ఏవేని ఇతర నిబంధనలను యూజర్ ఏజెన్సీ పాటించాలి.
1.22	రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ (https://parivesh.nic.in/) ద్వారా పైన తెలిపిన నిబంధనలపై కాంప్లియన్స్ రిపోర్ట్‌ను ప్రాసెస్ చేసి, దాఖలు చేయవలెను.

2. ప్రామాణిక నిబంధనలు

3. నిర్దిష్ట నిబంధనలు

క్ర.సం	నిబంధనలు
3.1	రాష్ట్ర ప్రభుత్వం మళ్లింపు ఉత్తర్వు జారీ చేసే లోపు షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006ను పాటించినట్లు నిర్ధారించుకోవలెను.
3.2	మళ్లించిన అటవీ ఏరియా మరియు CA ఏరియా యొక్క KML ఫైల్ అన్ని ఆవశ్యక వివరాలతో ఇ-గ్రీన్ వాచ్ పోర్టల్‌పై అప్‌లోడ్ చేయవలెను మరియు వివరాలను కాంప్లియన్స్ రిపోర్ట్‌తో పాటు దాఖలు చేయవలెను.

పైన తెలిపిన నిబంధనలపై కాంప్లియన్స్ రిపోర్ట్ స్వీకరించిన తర్వాత, ప్రతిపాదన తుది ఆమోదం కోసం పరిశీలించబడుతుంది. సూత్రప్రాయ ఆమోదంతో విధించిన నిబంధనలను సందర్భాన్ని బట్టి రెండు సంవత్సరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తుందని భావించడమైనది. సూత్రప్రాయ ఆమోదం చెల్లనేరదని మరియు రద్దయినట్లు భావించబడును.

కార్యనిర్వాహక ఇంజనీరు
రహదారులు మరియు భవనముల శాఖ, రాజమహేంద్రవరం